# సాక్షి
## పశ్చిమగోదావరి

శనివారం । 12 । ఏప్రిల్ । 2025




### పెళ్లి కారుకు ప్రమాదం

ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద క్వారీ లారీని పెళ్లి కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి.

10లో ▸



### 'హేలాపురి' కళకళలు

కళారంగంలో ఏలూరుకు ఘన కీర్తి ఉంది. ఇక్కడి కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ ఖ్యాతి గడిస్తున్నారు.

10లో ▸



### నేటి నుంచి రాట్నాలమ్మ తిరునాళ్ల

రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు శనివారం నుంచి అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి.

10లో ▸

## న్యూస్‌రీల్

### రైతులు దళారులను ఆశ్రయించొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు సెంట్రల్: రైతులు మద్దతు ధరకు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా మాత్రమే విక్రయించాలని, దళారులను ఆశ్రయించవద్దని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని శివదేవుని చిక్కాల రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం లోడు ఎత్తిన తర్వాత కూడా తేమ శాతాన్ని లెక్కించాలని, మిల్లు వద్దకు వెళ్లినా తేడా రాకూడదన్నారు. ట్రక్ షీట్ జనరేట్ చేసిన తర్వాత ఎఫ్‌టీఓ జనరేట్ చేయకపోతే సకాలంలో ధాన్యం సొమ్ములు జమకావన్నారు. రైతులు నగదు కోసం మిల్లుల వద్దకు వెళ్లనవసరం లేదన్నారు. వ్యవసాయ శాఖ జేడీ జెడ్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ దుర్గ కిషోర్, ఏడీఏ ఎ.పార్వతి, ఎంఏఓ రాజశేఖర్ ఉన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో గేట్ వద్ద నిరసన తెలిపారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపాలని, ఆగిపోయిన ప్రమోషన్స్ ఇవ్వాలని, గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రత్నం, జోనల్ ఉపాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.భుజంగరావు, డిపో అధ్యక్షుడు ఎంఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### సూత్రధారులను వదిలి పాత్రధారుల అరెస్టా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: సూత్రధారులను వదిలి పాత్రధారులను అరెస్టు చేసి కూటమి ప్రభుత్వం చట్టాన్ని పక్కదోవ పట్టిస్తోందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ యూత్ నేత నూకల రాము ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పార్టీ పోలవరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై కిరణ్ అనే వ్యక్తి సోషల్ మీడియా ద్వారా చేసిన దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. నిందితుడు కిరణ్ వెనకున్న అసలు దోషులను ప్రభుత్వం శిక్షించాలని డిమాండ్ చేశారు. కిరణ్‌ని అరెస్టు చేసిన పోలీసులు అతడి వాంగ్మూలాన్ని వక్రీకరిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల ఆలోచనలను తప్పుదోవ పట్టించేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. జగన్‌ని, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అసత్యపు ఆరోపణలు చేస్తోందన్నారు. నిలకడ లేని రాజకీయాలకు పవన్ కల్యాణ్, నైతిక విలువలు లేని రాజకీయాలకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని అన్నారు. ఖాకీలు ఖద్దర్ చొక్కాల మాటున విధులు నిర్వహిస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ 2.0 ఎలా ఉంటుందో కూటమి నేతలకు రుచి చూపిస్తామని బాలరాజు హెచ్చరించారు. మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, టౌన్ కన్వీనర్ సంకు కొండ, ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మ, నాయకులు పాల్గొన్నారు.

### ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. భౌతికశాస్త్రం పరీక్షకు 41 మందికి 35 మంది, రసాయన శాస్త్రం పరీక్షకు 41 మందికి 32 మంది హాజరయ్యారు. జిల్లాలో డీఈసీ కమిటీ ప్రయోగపరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

# పేరుకే స్టాక్ పాయింట్

**ఇసుక.. మస్కా**

- టన్ను ఇసుక ఇచ్చింది లేదు
- జిల్లాలో అలంకారప్రాయంగా స్టాక్ యార్డులు
- ఏర్పాటుచేసి రెండు నెలలు
- ఇంకా మొదలుకాని ఇసుక విక్రయాలు
- ర్యాంపుల వద్ద లారీకి రూ.5 వేల దోపిడీ
- జిల్లావాసులపై రోజుకు రూ.30 లక్షల వరకు అదనపు భారం



పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టాక్ యార్డు



కోలమూరు స్టాక్ యార్డులో తెరుచుకోని కౌంటర్

మూసి ఉన్న ఈ కౌంటర్‌ను గమనించారా? ఉండి నియోజకవర్గ ప్రజల ఇసుక అవసరాలు తీర్చే నిమిత్తం కొలమూరులోని ప్రైవేట్ స్థలంలో మైనింగ్ అధికారులు ఏర్పాటుచేసిన స్టాక్ యార్డ్‌లోని కౌంటర్ ఇది. వినియోగదారులకు ఇక్కడ ప్రభుత్వ నిర్ణీత ధరకే ఇసుకను విక్రయించనున్నట్టు ప్రకటించారు. స్టాక్ పాయింట్ నిర్వహణ బాధ్యతల్ని ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. స్టాక్ యార్డు ఏర్పాటుచేసి రెండు నెలలు దాటినా ఇప్పటికీ ఈ కౌంటర్‌ను ఓపెన్ చేసి వినియోగదారులకు లారీ ఇసుక విక్రయించిన దాఖలాలు లేవు.

సాక్షి, భీమవరం: జిల్లాలోని ఆరు ఓపెన్ రీచ్‌లు, ఐదు డిసిల్టేషన్ పాయింట్లు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోకి వెళ్లడంతో వాటిని మూసివేశారు. ఇసుక కోసం తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని తీపర్రు, పెండ్యాల, పందలపర్రు, గోపాలపురం, తదితర ర్యాంపులకు వెళ్లాల్సి వస్తోంది. స్థానిక అవసరాల నిమిత్తం ఆచంట, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఉండి నియోజకవర్గ కేంద్రాల్లో స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించింది. తీపర్రు–2 ర్యాంపు నుంచి ఇసుకను తరలించి స్టాకు యార్డుల ద్వారా అమ్మకాలు చేసే బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. ఆచంట స్టాక్ పాయింట్ వద్ద టన్ను రూ.295, పాలకొల్లులో రూ.320, తాడేపల్లిగూడెంలో రూ.300, తణుకులో రూ.215, నరసాపురంలో రూ.370, ఉండిలో రూ.440గా ధర నిర్ణయించారు. ఆయా స్టాకు పాయింట్ల వద్ద మొత్తం 900 టన్నుల ఇసుక అందుబాటులో ఉంచామని, అవసరమైన వారు తీసుకువెళ్లాలని ఫిబ్రవరి మొదటి వారంలో అధికారులు ప్రకటించారు.

**సేల్స్ మొదలు కాలేదు**

వినియోగదారులు తమ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదుచేసుకుని రిజిస్ట్రేషన్ రశీదును స్టాక్ పాయింట్ వద్ద చూపించి ఇసుక పొందవచ్చని, లేదా నేరుగా స్టాక్ పాయింట్ వద్దకు ఆధార్ కార్డును చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని సూచించారు. పాయింట్ వద్ద రిజిస్ట్రేషన్ చేయిస్తే అక్కడి ఇన్‌చార్జి డిజిటల్ పేమెంట్ చేయించుకుని ఇసుక సరఫరా చేసేలా ఏర్పాటుచేశారు. ఆయా స్టాక్ పాయింట్ల వద్ద ఉండే ఇన్‌చార్జిల నంబర్లను అధికారులు విడుదల చేశారు. వీటిలో కొన్ని పనిచేస్తుండగా మరికొన్ని స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. పాలకొల్లు, నరసాపురం, తణుకు, ఉండి కౌంటర్ల ఇన్‌చార్జిలకు ఫోన్లు చేసి ఇసుక అమ్మకాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా వారి నుంచి అమ్మకాలు ఇంకా మొదలు కాలేదన్న సమాధానం వచ్చింది. అమ్మకాలు ప్రారంభించకపోవడంపై జిల్లా గనులు, భూగర్భశాఖ ఏడీని ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా కనెక్ట్ అవ్వలేదు.

**అధికారులు చర్యలు తీసుకోవాలి**

ఉదాహరణకు ఐదు యూనిట్ల లారీని నింపేందుకు దాదాపు 20 టన్నుల ఇసుక అవసరమవుతుంది. ప్రస్తుతం ర్యాంపు వద్ద నుంచి ఉండి ప్రాంతానికి లారీకి సుమారు రూ.17 వేల వరకు వసూలు చేస్తున్నారు. స్థానికంగా ఏర్పాటుచేసిన స్టాక్ పాయింట్‌ను వినియోగంలోకి తెస్తే ఇసుక లోడింగ్‌కు రూ.8,800, రవాణా నిమిత్తం రూ.3 వేలు వెచ్చించినా రూ.11,800లకే ఇసుక లభ్యమవుతుంది. వినియోగదారులకు రూ.5 వేల వరకు ఆదా అవుతుందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ స్టాకు పాయింట్లతో ర్యాంపు నిర్వాహకుల దోపిడీకి ఆస్కారం ఉండదు. తక్కువ ధరకే జిల్లా వాసులకు ఇసుక లభ్యమవుతుంది. జిల్లాలో ఏర్పాటుచేసిన స్టాకు పాయింట్లు తెరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

**అడ్డగోలుగా వసూళ్లు**



**ఇసుక ఉచిత**మని, లో**డింగ్ చార్జీలు** చెల్లిస్తే సరి**పోతుందని** ప్రభుత్వం **చెబుతోంది.** ఏ ర్యాంపు **వద్దకు వెళ్లి**నా లోడింగ్ **చార్జీలతో** పాటు రూ.5 వేల నుంచి రూ.7 **వేల వరకు** అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని వినియోగదారులతో పాటు కిరాయిలు రాక లారీ యజమానులు నష్టపోతున్నాం. అధికారులు స్పందించి అదనపు వసూళ్లను ఆపాలి.

– రావూరి రాజా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు

**రూ. లక్షల్లో భారం**

పొరుగు జిల్లాల్లోని ఏ ర్యాంపు వద్దకు వెళ్లినా లోడింగ్ చార్జీలతో పాటు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అదనంగా చెల్లిస్తేనే ఇసుక లోడింగ్ చేస్తున్నట్టు లారీ యజమానులు చెబుతున్నారు. అదనపు వసూళ్ల రూపంలో పాలకులు, నాయకుల జేబుల్లోకి వెళుతున్న వాటాల మొత్తం భారాన్ని జిల్లాలోని వినియోగదారులు భరించాల్సి వస్తోందంటున్నారు. ఆయా ర్యాంపుల నుంచి జిల్లాకు రోజుకు 500 నుంచి 600 లారీల ఇసుక రవాణా జరుగుతుండగా ఈ మేరకు స్థానిక వినియోగదారులపై రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు భారం పడుతోందని అంచనా.

### వరి నేలవాలి.. రైతులు విలవిల్లాడి

- ఈదురుగాలులతో బెంబేలు
- వర్షంతో తడిసిన ధాన్యం



గణపవరంలో నేలవాలిన వరి పైరు

గణపవరం/ఆకివీడు: వాతావరణం రైతులను కలవరపెడుతోంది. రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో మబ్బులు కమ్మి ఈదురుగాలులు వీస్తూ చిరుజల్లులు పడుతున్నాయి. అయితే గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో కోతలకు సిద్ధమైన వరి చేలు నేలనంటాయి. గణపవరం మండలంలో సుమారు 14 వేల ఎకరాల్లో రబీ పంట వేయగా ఇప్పటికే 2 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. 25 శాతం పంట కోత దశలో, మిగిలిన పైరు కోతకు సిద్ధంగా ఉంది. ఈ దశలో వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నేలవాలిన పైరును శుక్రవారం రైతులు నిలబెట్టి కట్టలు కట్టారు. చేలల్లో చేరిన నీటిని బయటకు తరలిస్తున్నారు. కోతలు పూర్తయి ధాన్యాన్ని రోడ్ల మీదికి చేర్చిన రైతులు ఎండ బెట్టుకుంటున్నారు. ధాన్యం రాశులు తడవకుండా బరకాలు, టార్పాలిన్‌లు కప్పి కాపాడుకుంటున్నారు. నెలాఖరు వరకూ వాతావరణం అనుకూలిస్తే గట్టెక్కుతామని రైతులు అంటున్నారు. ఆకివీడు, భీమడోలు తదితర మండలాల్లో తడిసిన, యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

### నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం. ఉదయ భాస్కరరావు ఉత్తర్వుల మేరకు శనివారం (రెండో శనివారం) జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలూ పనిచేస్తాయని ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యాలయాలు పనిచేస్తాయని, ఎలాంటి అదనపు రుసుం లేకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

**ఉద్యోగుల్లో వ్యతిరేకత**

ప్రభుత్వం ఆదాయం కోసం ఉద్యోగుల హక్కులు కాలరాస్తోందని ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెల 30, 31 తేదీల్లో సెలవు రోజులైనా రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయని, పండుగ రోజుల్లో కూడా తాము పనిచేసి ఆదాయాన్ని తీసుకువచ్చామని అంటున్నారు. తమ ఉదారతను అలుసుగా తీసుకుని ప్రతి సెలవు దినంలో పనిచేయమంటే కుదరదని చెబుతున్నారు. రెండో శనివారం, పండుగ రోజుల్లో పనిచేయాలని ఆదేశిస్తే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరిస్తున్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లుపై మండిపాటు



నరసాపురం: ర్యాలీ చేస్తున్న ముస్లింలు



ఆకివీడు: నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు



పాలకొల్లు సెంట్రల్: ర్యాలీ చేస్తున్న ముస్లింలు

నరసాపురం: ముస్లింల రక్షణకు విఘాతం కలిగించే వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని నరసాపురం అంజుమన్ సంఘ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. పంజా సెంటర్ నుంచి ప్రకాశం రోడ్డు మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. అంబేడ్కర్ సెంటర్ వద్ద జరిగిన సభలో బులిమస్తాన్ మాట్లాడుతూ ముస్లింల హక్కులను కాలరాసేలా వక్ఫ్ సవరణలకు కేంద్రం పూనుకుందన్నారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు. అంజుమన్ సంఘ నాయకులు దావూద్ ఖాన్, షేక్ సిలార్‌సాహెబ్, ఎండీ మౌలాలీఖాన్, ఎండీ బాషాఖాన్, బడా వలీ, ఖాజీ ఇమ్రాన్ నాయకత్వం వహించారు.

**ఆకివీడులో..**

ఆకివీడు: వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని స్థానిక జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో ధర్నా చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీపీఎం, వైఎస్సార్‌సీపీ, ముస్లిం నాయకులు మాట్లాడుతూ చట్టంతో ముస్లింల మనోభావాలతో పాటు వారిని ఆర్థికంగా దెబ్బతీసినట్టు అవుతుందన్నారు. కొత్త చట్టాల వల్ల మైనార్టీలు భయంతో బతకాల్సి ఉంటుందన్నారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఎండీ బిలాల్, సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, బీవీ వర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ సిద్ధిక్, జక్కీ, మాబూ, సాహిజ్ తదితరులు పాల్గొన్నారు.

**వక్ఫ చట్ట సవరణ చట్టాన్ని నిలుపుదల చేయాలి**

ఇరగవరం: వక్ఫ్ సవరణ బిల్లును నిలుపుదల చేయాలని ముస్లింలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేలంగిలో సీపీఎం పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కామన మునిస్వామి మాట్లాడారు. ముస్లిం ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. గ్రామ శాఖ కార్యదర్శి ఇల్లంపాటి సత్యనారాయణ, కమిటీ సభ్యులు షేక్ బాబ్జి, షేక్ ఆలీబాబా, సల్మాన్, బాషా, పాన్ బీబీ తదితరులు పాల్గొన్నారు.

**పాలకొల్లులో గర్జించిన ముస్లింలు**

పాలకొల్లు సెంట్రల్: వక్ఫ్ సవరణ బిల్లును భేషరతుగా వెనక్కి తీసుకోవాలని నియోజకవర్గ ముస్లిం ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జానీ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో సున్ని జామియా మసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జానీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి ముస్లిం మనోభావాలను దృష్టిలో పెట్టుకుని అల్లా ఆస్తులను కాపాడి రాష్ట్రంలో వక్ఫ్ బిల్లు అమలు కాకుండా చూడాలన్నారు. షేక్ శిలార్, నజీర్, షేక్ మస్తాన్, మదీనా బీషా, రౌఫ్, బ్రాడీపేట మసీద్ ప్రెసిడెంట్ సల్మాన్ బాజీ, రామారావు పేట అధ్యక్షుడు షేక్ బాబాజీ, పూలపల్లి మసీదు అధ్యక్షుడు మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛకు విఘాతం

పత్రికలు, ప్రసార మాధ్యమాలు స్వేచ్ఛగా పనిచేయగల సమాజంలోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.. ఇదేమి పాలన అని ప్రశ్నిస్తే కేసులు.. ఏమిటీ దౌర్జన్యం అని నిలదీస్తే దాడులు.. అన్యాయం అని నిరసన తెలిపితే అరెస్టులు.. ప్రజాస్వామ్యం జిందాబాద్ అంటే జైళ్లు.. ఇదీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ తీరు. రాష్ట్రంలో అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు 'సాక్షి'పై కక్ష గట్టిన ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ కార్యకర్త హత్యను 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు ఆరుగురు విలేకరులపై అక్రమ కేసులు పెట్టింది. కూటమి ప్రభుత్వ తీరును ఖండిస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాత్రికేయులు గళమెత్తారు. తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపి వినతిపత్రాలు అందించారు.

- 'సాక్షి' ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు
- మండిపడ్డ జర్నలిస్టు సంఘాలు
- నిరసనలు.. వినతిపత్రాలు అందజేత
- జిల్లావ్యాప్తంగా ఆందోళనలు



తణుకు అర్బన్: తణుకులో తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

తణుకు అర్బన్: పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన హత్యకు సంబంధించి 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు ఆరుగురు పాత్రికేయులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై తణుకు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు తహసీలార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించవద్దని, అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని నినదించారు. ఏపీయూ డబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తులా భాస్కర్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులను కాలరాసేలా అక్రమ కేసులు నమోదుచేయడం శోచనీయమన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. అనంతరం తహసీల్దార్ దండు అశోక్‌వర్మకు తణుకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే మాజీ సెక్రటరీ కొడమంచిలి కృష్ణ, ఏపీయూడబ్ల్యూజే చిన్నపత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమ్మి ఏడుకొండలు, తణుకు ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు బొండ రామ్‌కుమార్, పాత్రికేయులు తానేటి దొరబాబు, గజ్జరపు నారాయణమూర్తి, కొలగాని రాజా, పంజా శివ, వెలగల నారాయణరెడ్డి, చిల్లా రాజశేఖర్, గాదిరెడ్డి రామ్‌ప్రసాద్, రంబాల బద్రి, అమర రాజశేఖర్, సతీష్, హరీష్, పెద్దిరాజు, సత్యప్రసాద్, డేగల మణి, ఆనంద్, ముమ్మిడివరపు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఉండి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు



పాలకొల్లు సెంట్రల్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

**కేసులు సిగ్గు సిగ్గు**

ఉండి: మీడియాపై అక్రమ కేసులు సిగ్గు సిగ్గు అంటూ ఉండి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు నినదించారు. ఉండి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.కృష్ణ మోహన్, చిట్టూరి జోషి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మీడియాపై అక్రమ కేసులు దారుణమని, గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన నీతులు మర్చిపోయిందా అంటూ ప్రశ్నించారు. ప్రజల పక్షాన నిలిచే మీడియాను అణగదొక్కేలా అక్రమ కేసులు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సీనియర్ జర్నలిస్టులు తాళం హనుమంతరావు, బురిడి రవిబాబు, సీహెచ్ బంగార్రావు, ప్రెస్‌క్లబ్ కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు తాళం హనుమంతరావు, బురిడి రవిబాబు, సీహెచ్ బంగార్రావు, మణికంఠ, కేశవ, బాలాజీ, వెంకటరమణ, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

**పత్రికా స్వేచ్ఛను కాపాడాలి**

పెనుగొండ: జర్నలిస్టులపై కేసు నమోదు చేయడం భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతమే అంటూ పెనుగొండలో జర్నలిస్టులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెనుగొండలో తహసీల్దార్ జి.అనితకుమారికి వినతిపత్రం సమర్పించారు. విలేకరులు గుర్రాల శ్రీనివాసరావు, తేతలి తమ్మిరెడ్డి, బి.చిట్టిబాబు, రాజశేఖర్, పి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

**కేసులు తక్షణమే ఎత్తివేయాలి**

జంగారెడ్డిగూడెం: ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పాత్రికేయులు జంగారెడ్డిగూడెంలో శుక్రవారం సమావేశమయ్యారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించవద్దని, అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ కోరారు. అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డీవీ భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ రమణరావు, ఎం.గంగరాజు పాల్గొన్నారు.

**అక్రమ కేసులు అన్యాయం**

పాలకొల్లు సెంట్రల్: వృత్తి ధర్మంలో భాగంగా వార్తలు రాస్తే కేసులు కట్టే సంస్కృతి నుంచి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సెక్రటరీ ఎంఎస్‌వీ సాంబశివరావు అన్నారు. శుక్రవారం పట్టణ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రెస్‌క్లబ్ ట్రెజరర్ తోట రాంబాబు, క్లబ్ సభ్యులు బండి శ్రీనివాస్, పులపర్తి నాని, మండెల అప్పలరాజు, వానపల్లి భాను, కారుమంచి రాజ్‌గోపాల్, పప్పుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రాట్నాలమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి


ఆలయ ముఖ ద్వారం భారీ సెట్టింగ్

**పెదవేగి:** మండలంలోని రాట్నాలకుంట గ్రామంలో ఉన్న రాట్నాలమ్మ వారి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతిఏటా ఎంతో అట్టహాసంగా నిర్వహించే ఈ తిరునాళ్లకు జిల్లా నుంచే కాక రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. ఏప్రిల్ 12 నుంచి 16 వరకు ఈ తిరునాళ్ల జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఈఓ ఎన్.సతీష్, చైర్మన్ మన్నే శ్రీనివాసరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ సెట్టింగ్‌లు ఆకర్షిస్తున్నాయి. శని వారం నుంచి మూడు రోజుల పాటు రాత్రి సమయాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్ర మాలు ఏర్పాటు చేశారు. అలాగే 16న మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### రేపు జంగారెడ్డిగూడెంలో ఉద్యోగ మేళా

**జంగారెడ్డిగూడెం:** స్థానిక శ్రీరామచంద్ర విద్యా సంస్థల్లో ఆదివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తు న్నట్లు శ్రీరామచంద్ర విద్యా సంస్థల చైర్మన్ బీవీ కృష్ణారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రముఖ ఫార్మా కంపెనీ మెట్రోకెమ్ ఏపీఐ ప్రైవేట్ లిమిటెడ్ వైజాగ్, హైదరాబాద్ శాఖల్లో ఉన్న 300 ఖాళీలను ఈ మేళాలో భర్తీ చేస్తుందని వివరించారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీ ర్ణులైన ఆసక్తి ఉన్న అభ్యర్థులు మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 87126 35899, 87126 87497, 87126 11847 నం బర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

### స్విమ్మింగ్ కోచ్ గణేష్‌కు అరుదైన గుర్తింపు



**ఏలూరు రూరల్:** ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్ కోచ్ బలగా గణేష్ పాక్ జలసంధి ఈదేందుకు అనుమ తులు సాధించాడు. ఈ నెల 17, 18 తేదీల్లో శ్రీలంక, భారతదేశం సరి హద్దుల మధ్య 31 కిలోమీటర్ల మేర సముద్రం లో పాక్ జలసంధిలో ఈత కొట్టనున్నాడు. ఆం ధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఈ గుర్తింపు సాధించిన మొట్టమొదట తెలుగు పారా స్విమ్మ ర్‌గా అరుదైన ఘనత సాధించాడు. ఈ సంద ర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు, డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాసరావుతో పాటు పలువురు శిక్షకులు పోటీ దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆయనకు అభినందనలు తెలిపారు.

# కళారంగంలో హేలాపురి కళకళలు

- ఏలూరులో ఒకే ఏడాది ముగ్గురికి కళారత్న అవార్డులు
- లలిత కళల్లో చేసిన సేవలకు ప్రభుత్వ గుర్తింపు


హంస అవార్డుతో ఎస్‌వీ రామారావు


కళారత్న అవార్డుతో పార్వతి రామచంద్రన్


హంస అవార్డుతో సప్పా భారతి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** కళారంగానికి సంబంధించి ఏలూరుకు ఘనమైన కీర్తి ఉంది. ఈ ప్రాంతానికి చెందిన ఎంతోమంది కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఈ ప్రాంతానికి గొప్ప గుర్తింపు తీసుకువచ్చారు. ఏలూరు అంటేనే కళలకు కాణాచి అని జాతీయ స్థాయిలో చెప్పుకునేటంత ప్రఖ్యాతి ఈ ప్రాంతానికి ఎంతోమంది కళాకారుల ద్వారా వచ్చింది. సంగీతం, నాటకం, నృత్యం ఇలా ఆయా రంగాల్లో ఏలూరుకు చెందిన కళాకారులు విదేశాల్లో సైతం ప్రదర్శినలిచ్చి అక్కడి ప్రజలను ఉర్రూతలూ గించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అటువంటి ఏలూరుపై 2025వ సంవత్సరంలో కళారత్న (హం స)అవార్డులు గుంపులుగా వాలాయి.

**హేలాపురి కీర్తి కిరీటంలో కళారత్నాలు**

కళా సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అవార్డుల్లో హంస అవార్డు అత్యున్నతమైనదిగా కళా కారులు భావిస్తారు. ఈ అవార్డు రావాలంటే 64 కళల్లో ఏదో ఒక కళలో విశేషమైన కృషి, సేవ చేసి ఉం డాలి. అలాగని ఎవరికిపడితే వారికి ఇచ్చే అవార్డు కాదిది. 64 కళల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎంతో కొంతమంది తమ ఉనికిని చాటుకుంటూనే ఉన్నారు. అలాంటి వారి పోటీని ఎదుర్కొని ఈ అవార్డు సాధిం చడం గొప్ప ఘనతగానే గుర్తించాలి. అంతటి ఘనతను ఏలూరుకు చెందిన ముగ్గురు కళాకారులు ఈ ఏడాది ఉగాది నాడు అవార్డులు అందుకుని హేలాపురి కీర్తి కిరీటంలో కళారత్నాలుగా నిలిచారు. సినీ, నాటక రంగాల్లో చేసిన కృషికిగానూ ఎస్‌వీ రామారావు, కూచిపూడి నృత్య రంగంలో చేసిన కృ షికి గానూ ఎ.పార్వతి రామచంద్రన్, హరికథాగాన రంగంలో సప్పా భారతికి అవార్డులు వచ్చాయి.

### హరికథలో ప్రత్యేకత

సప్పా భారతి భాగవతారిణి తన ప్రాథమిక విద్యను తణుకు, అత్తిలిలో చదివి తల్లిదండ్రులిరు వురు మరికళా కళాకారులు కావడంతో ఆ కళపై మక్కువ పెంచుకుని 12వ ఏటనే హరికథా కళను అభ్యసించడం ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురంలోని శ్రీ సర్వారాయ హరి కథా పాఠశాలలో దాదాపు 6 ఏళ్లు శిక్షణ పొం దారు. ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం లో ఏ–గ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు పొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో 5 వేలకు పైచిలుకు హరికథా ప్రదర్శనలు చేశారు. తెలం గాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా జాతీయ బంగారు నంది పురస్కారం, పాండిచ్చే రికి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్, భారత కళారత్న అవార్డు, గరికపాటి ఆర్ట్స్ థియేటర్, గౌరీ సేవా సంఘం అనకాపల్లి సంస్థలచే స్వర్ణ కంకణాలతో ఘన సన్మానం అందుకున్నారు. హరికథారత్న, హరిక థా సరస్వతి, హరికథా గాన ప్రవీణ, హరికథా గాన ప్రపూర్ణ, హరికథా చూడామణి, అనర్గళ కం ఠామృత, హరికథా భారతి, వంటి బిరుదులను వివిధ సంస్థలిచ్చి ఈమెను ప్రోత్సహించాయి. హరికథ కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ల డమే తన లక్ష్యమని ఆమె పేర్కొంటున్నారు.

### రచనల్లో మేటి రామారావు

1940వ సంవత్సరంలో ఏలూరులో జన్మించిన ఎస్‌వీ రామారావు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసి 1998లో పదవీ విరమణ చేశారు. ఆయన తన 13వ ఏటనే తారుమారు అనే నాటిక రాసి ప్రదర్శించారు. ఇప్పటి వరకూ 12 నాటికలు, 3 నాటకాలు రాసి దర్శకత్వం వహిం చి, ప్రదర్శించారు. వాటిలో కొన్ని రేడియోల్లోనూ, మరికొన్ని దూర దర్శన్‌లోనూ ప్రసారమయ్యాయి. నటుడిగాను 300 ప్రదర్శనల్లో పాల్గొనడమే కాక కొన్ని సినిమాల్లో సహాయ పాత్రల్లో నటించి మెప్పించారు. అనంతరం తెలుగు సినీ చరిత్రకారుడిగా సినిమాలకు సంబంధించిన 15 గ్రంథాలు రచించారు. సినీ రంగంపై ఈయనకు ఉన్న పట్టును గుర్తించి సి.నారాయణరెడ్డి ఈయనను సినీ విజ్ఞాన విశారద బిరుదుతో సత్కరించారు. మద్రాస్ తెలుగు అకాడమీ, ఢిల్లీ తెలుగు అకాడమీ, వంశీ ఇంటర్నేషనల్, యువ కళావాహిని, రసమయి, గరికపాటి ఆర్ట్స్ వంటి సంస్థల నుంచి పురస్కారాలు అం దుకోవడంతో పాటు అక్కినేని–కిన్నెర స్వర్ణ కంకణ పురస్కారం అం దుకున్నారు .ఏలూరులో పుట్టినందువల్లే తనకు కళలపై ఆసక్తి కలిగిం దని ఆయన చెబుతున్నారు.

### నాట్యాచారిణిగా ఎంతో గుర్తింపు

పార్వతి రామచంద్రన్ 1948వ సంవత్సరంలో జన్మిం చారు. పూర్వీకులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారైన ప్పటికీ ఏలూరులో స్థిరపడడంతో ఆమె ప్రస్థానమంతా ఏలూరుతోనే ముడిపడి ఉంది. సీఆర్ ఆచార్య, గుడిమె ట్ల శ్రీకృష్ణ, వాసిరెడ్డి కనకదుర్గ వంటి ఉద్దండ గురువుల వద్ద భరతనాట్యంలో శిక్షణ పొంది అనంతరం వేదాం తం ప్రహ్లాద శర్మ, వేదాంతం రాధేశ్యామ్‌ల వద్ద కూచి పూడి నృత్యంలో శిక్షణ పొందారు. 1978 సంవత్సరం లో కళాదీపిక నాట్య సంస్థను స్థాపించి వేలాది మంది శిష్యులను నృత్య రంగంలో తీర్చిదిద్దారు. నాట్యరత్న, నాట్య మయూరి, నాట్య సుధ, నాట్య విదూషీమణి వం టి బిరుదులను వివిధ కళా సంస్థల నుంచి అం దుకున్నారు. 45 సంవత్సరాల పాటు సెయింట్ థెరిస్సా పాఠశాలలో నాట్య ఉపాధ్యాయినిగా సేవలందించానని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు పొందానని ఆమె వివరిస్తున్నారు.

# రీ-సర్వేపై కేంద్ర బృందం పర్యటన


నిట్ కాన్ఫరెన్స్ హాలులో రీ-సర్వే వివరాలపై చర్చిస్తున్న కేంద్రబృందం

**తాడేపల్లిగూడెం అర్బన్/తాడపల్లిగూడెం రూరల్/ పెంటపాడు :** ప్రజలకు చెందిన స్థిరాస్తుల వివరాలు పక్కాగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని కేంద్ర ప్రభుత్వ ఐఏఎస్ అధికారి, డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి, యశడా డైరెక్టర్ జనరల్ నిరంజన్ కుమార్ సుధాంసు తెలిపారు. ఈ సందర్భంగా భూముల రీ-సర్వేపై స్థానిక నిట్ కాన్ఫ రెన్స్ హాలులో కేంద్రప్రభుత్వం నుంచి వచ్చిన బృందం జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, సచివా లయ ప్లానింగ్ సెక్రటరీలతో శుక్రవారం సమావే శాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నిర్వహించిన రీ-సర్వేపై చర్చించారు. ఇప్పటి వరకు పూర్తిచేసిన రెండు విడతల రీసర్వేలో తమ దృష్టికి వచ్చిన సమ స్యలను పరిష్కరించిన వివరాలపై సమీక్షించారు. తాడేపల్లిగూడెంలోని 23వ వార్డులో రీసర్వే నిర్వహిం చిన ప్రాంతాల ప్రజలతో చర్చించి వారి నుంచి మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలోని రెండో ప్రపంచ యుద్ధ అవసరాలకు వినియోగించిన విమానాశ్రయ భూముల్లో సుమారు 4 వేల కుటుంబాలు నివా సాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాయ న్నారు. ఆయా భూములు రిజిస్ట్రేషన్లు చేయించు కునే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వ బృందానికి తెలియజేశారు. అలాగే మండలంలోని చినతాడేపల్లి గ్రామానికి చెందిన అక్కిన గంగా భవాని నివాసం వద్ద కడియద్ద రెవెన్యూకు సంబం ధించిన రీ-సర్వేపై రైతులతో సమావేశం నిర్వహిం చారు. అనంతరం పెంటపాడు మండలంలోని కె. పెంటపాడు బైరాగిమఠంలో నిర్వహించిన సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సర్వే డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ డీఎల్‌బీఎల్ కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ విద్యులత, ఐఏఎస్ అధికారి ఆర్ఎం గోవిందరావు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ కౌసర్‌భానో, ఆర్‌డీ బాల స్వామి, మున్సిపల్ కమిషనర్ వై.ఏసు పాల్గొన్నారు.

# మండల సమావేశం బహిష్కరణ

**యలమంచిలి ఎంపీపీ ఎన్నిక వాయిదాపై వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల నిరసన**


యలమంచిలి మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు

**యలమంచిలి:** ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఎంపీపీ ఎన్నికను వాయిదా వేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిం చిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బహి ష్కరించారు. ఊహించని పరిణామానికి అటు అధి కారులు, ఇటు కూటమి సర్పంచ్‌లు బిత్తర పోయారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్ష తన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావే శాన్ని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత ఏర్పాటు చేశారు. సమావేశానికి వైఎస్సార్ సీపీకి చెందిన 12 మంది ఎంపీటీసీ సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. ప్రతిపక్ష కూటమి సభ్యులు ఎవరూ రాలేదు. ఇటీవలె వైఎస్సార్ సీపీ నుంచి తెలు గుదేశం పార్టీలోకి వెళ్లిన మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ మాత్రం వచ్చారు. సమావేశాన్ని ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస రావు ప్రారంభిస్తూ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేస్తామని చెబుతుండగా వైఎస్సార్ సీపీకి చెందిన గుంపర్రు ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో తనను అన్యాయంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని మండిపడ్డారు. ఏనుగువానిలంక ఎం పీటీసీ సభ్యులు వినుకొండ ధనలక్ష్మి మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 12 మంది సభ్యులు ఉన్నా నలుగురు సభ్యులు ఉన్న కూటమి నాయకులు చేసిన తప్పుడు ఆరోపణలకు అధి కారులు వత్తాసు పలికి ఎన్నికను అర్ధాంతరంగా నిలిపివేయడానికి నిరసనగా మండల సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని చెప్పారు. దీంతో మిగిలిన 11 మంది సభ్యులు ఆమె వెంట బయటకు వెళ్లిపో యారు. సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులకు మద్దతుగా సర్పంచ్‌లు కూడా సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికీ మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ మాత్రమే సంతకం చేశారు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత ప్రక టించారు.


సమావేశాన్ని బహిష్కరించి బయటకు వస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు



### గ్యాస్ సిలిండర్‌తో నిరసన


నిరసన తెలియజేస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

**కుక్కునూరు:** పెట్రో, గ్యాస్, డీజిల్ ధరల పెంపుకు నిరసనగా సీపీఐఎం ఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కునూరు ప్రధాన సెంటర్ లో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం నిత్యావ సర ధరలు తగ్గిస్తామని చెప్పి వివిధ రకాల పన్నుల భారాన్ని ప్రజలపై మోపి పెట్టుబడిదారులకు వేల కోట్లు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినప్పటికి అనేక మార్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంగాల కల్లయ్య, షేక్ మున్ని, సొడే చిరమయ్య తదితరులు పాల్గొన్నారు.

### 17న ఆశ్రంలో జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

**ఏలూరు రూరల్:** ఆశ్రం మెడికల్ కళాశాల ఆవరణలో ఈ నెల 17న సీనియర్ మెన్ జట్టు, 18న అండర్-23 మెన్, అండర్-19 బాలుర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్య వర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 01-09-2002 తర్వాత పుట్టిన వారు అండర్-23 విభాగానికి, 01-09-2006 తర్వాత పుట్టిన వారు అం డర్-19 విభాగం పోటీల్లో పాల్గొనేందుకు అర్హులను వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు పుట్టిన తేదీ, ఆధార్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారు 2025-2026 సంవత్సరానికి ఏసీఏ నిర్వహించే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొం టారని వివరించారు.

### తెలంగాణలో ఉన్నా ఉపాధి సొమ్ము జమ

**ద్వారకాతిరుమల:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో జరుగు తున్న అవకతవకలు రాష్ట్ర సరిహద్దులు దాటాయి. మండలంలోని ఐఎస్ జగన్నాథపురానికి చెందిన దంపతులు పసుపులేటి నరసింహమూర్తి, అతని భార్య పావని ఏడాది క్రితం తెలంగాణలోని సంగారెడ్డికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అయితే ఐఎస్ జగన్నాథపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో వారికి మస్తర్లు పడుతున్నాయి. దీంతో వారి బ్యాంకు ఖాతాకు నగదు కూడా జమ అవుతుంది. అయితే వారిద్దరూ ఐఎస్ జగన్నాథపురం లో ఈనెల 1 నుంచి 5 వరకు పసుపులేటి వీరాయమ్మ తోటలో రింగ్ ట్రెం చ్ పనులు చేసినట్టు ఆన్‌లైన్‌లో చూపారు. ఆ పనిదినాలకు సంబంధించిన రూ. 2,742 లను వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇది తెలిసిన కొం దరు గ్రామస్తులు అధికారుల తీరును తప్పుబడుతున్నారు. అలాగే పనికి వెళ్లని ఒక టీడీపీ నాయకుడికి, తాపీ మేస్త్రీకి, ట్రాక్టర్ డ్రైవర్‌కు, ఇలా మరి కొంత మందికి ఉపాధి మస్తర్లు వేస్తున్నారని చెబుతున్నారు. ఈ వ్యవ హారం చాలా రోజులుగా సాగుతోందని అంటున్నారు. అయితే దొంగ మస్తర్ల ద్వారా వచ్చే సొమ్ములో వాటాలు సంబంధిత అధికారులు, సిబ్బం దికి అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి, ఉపాధి సొమ్మును అక్రమంగా స్వాహా చేస్తున్న వారిపై తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# లారీని ఢీకొన్న పెళ్లి కారు

**ఆరుగురికి గాయాలు**


ప్రమాదానికి గురైన పెళ్ళికొడుకు కారు

**ఉంగుటూరు:** జాతీయరహదారిపై శుక్రవారం సాయంత్రం నాచుగుంట క్రాసింగ్ పాయింటు వద్ద లారీ-కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పాలకొల్లుకు చెందిన ఓ కుటుం బం పెళ్లి నిమిత్తం పెళ్లికొడుకుతో సహా ఏలూరు వెళ్తున్నారు. అయితే నాచుగుంట వద్ద ఏలూరు కాలువపై వంతెన మీద నుంచి రహదారి మీదకు ఒక్కసారిగా వచ్చిన క్వారీ లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొల్లంశెట్టి నాగమణి (65), కొల్లం శెట్టి నాగేశ్వరరావు(70), గంటాపద్మావతి (58), పసుమర్తి రాజేంద్రప్రసాదు (38)కు తీవ్రగాయలు కాగా, జి.నవీన్ (34), పెళ్ళికొడుకు, ప్రవీణ్‌కుమార్(32) స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను హైవే అంబులెన్స్ ద్వారా ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. ఈ మేరకు ఎస్సై సూర్యభగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే టోల్ ఫీజు మినహా యింపు కోసం ఉంగుటూరు బ్రిడ్జి మీదుగా నాచు గుంట వద్దకు అక్కడ నుంచి హైవేపైకి వచ్చే వాహ నాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రాం తవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కార్లకే పరిమితమైన ఉల్లంఘనలు ప్రస్తుతం క్వారీ లారీలు సైతం వస్తుండడంతో రోడ్లు పాడైపో తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా టోల్ అధి కారులు ఈ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కంకర మాఫియాకు పోల‘వరం’


గొల్లగూడెంలో కుడి కాలువ గట్టుపై కంకర తవ్విన ఆనవాళ్లు

**ఉంగుటూరు:** మండలంలోని కంకర మట్టి మాఫియాకు పోలవరం కుడికాలువ గట్టు వరంలా మారింది. రాత్రి సమయంలో పోలవరం కుడికా లువ గట్టును తవ్వి దర్జాగా మట్టిని తరలించుకుపో తున్నారు. మండలంలోని చేబ్రోలు, నారాయణపు రం, కై కరం గ్రామాల్లో ఈ కంకర మాఫియా ముఠాలు తయారయ్యాయి. అలాగే మండల సరిహద్దు ప్రాంతమైన శింగరాజుపాలెం నుంచి ఉం గుటూరు మండలం కంసాలిగుంట వరకు సుమారు 20 కిలోమీటర్ల మేరకు ఈ కాలువ విస్తరించి ఉంది. ఆ కాలువ వెంబడి గోపాలపురం, గొల్లగూడెం, కం సాలిగుంట, నల్లమాడు, యర్రమిల్లిపాడు గ్రామాల్లో రోజూ పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్ట ర్లపై కంకర తరలిపోతోంది. లక్షలాదిరూపాయలు సొమ్ములు ఆర్జిస్తున్నారు. కూటమి ముఖ్య నేతల అండదండలతోనే ఈ కంకర మాఫియా చెలరేగిపో తుందని ప్రజలు చెబుతున్నారు. ఈ తవ్వకాలు గొల్లగూడెం వీఆర్‌ఓ నాగరాజును ప్రశ్నించగా మా దృష్టికి వచ్చిన వెంటనే వెళ్లి పట్టుకుని కేసులు పెడు తున్నట్లు వివరించారు. అలాగే ఇటీవల కంసాలి గుంట ప్రాంతం నుంచి కంకర తరలిస్తుంటే కేసులు కూడా నమోదు చేశామని వివరించారు.

### పంచాయతీ నిధులు కాజేసిన బిల్లు కలెక్టర్

**దెందులూరు:** స్థానిక గ్రామ పంచాయతీలో బిల్లు కలె క్టర్‌గా పనిచేస్తున్న కే నరసింహారావు పంచాయతీ నిధులు కాజేసి విధులకు గైర్హాజరవుతున్నారని దెందు లూరులోని పోలీస్ కానిస్టేబుల్ పి.మధు జిల్లా కలెక్ట ర్‌కు గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఈ ఫిర్యాదు పై డీపీఓను నివేదిక కోరారు. దెందులూరు గ్రామ పంచాయతీలో 2019 నుంచి 2025 వరకు వసూలు చేసిన ఇంటి పన్నులు, కుళాయి పన్నులను బిల్లు కలెక్టర్ కె.నరసింహారావు రూ.7,94,598ల నగదును తీసుకువెళ్లి నేటికి భీమ డోలు ట్రెజరీ, లేదా దెందులూరు పంచాయతీలకు జమ చేయడం లేదని గుర్తించారు. ఈ మేరకు దెం దులూరు గ్రామ కార్యదర్శి స్కానిష్ బాబు, దెం దులూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భీమరాజు, ఏలూరు డీఎ ల్‌పీఓ పూర్ణచంద్రరావు ఇచ్చిన నివేదికను డీపీఓ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

### అంబేడ్కర్ జయంతి వేడుకలకు సుబ్బయ్యకు ఆహ్వానం



**భీమవరం:** భారత పార్ల మెంట్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న బాబా సాహెబ్ బీఆర్ అం బేడ్కర్ జయంతి కార్యక్ర మాన్ని పట్టణానికి చెందిన ఫౌండేషన్ కేంద్ర బోర్డు సభ్యుడు గరికిముక్కు సుబ్బయ్యకు ఆహ్వానం అందిందని శుక్రవారం ఆయన విలే కరులకు తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయం , సాధికారత మంత్రిత్వ శాఖ, అంబేడ్కర్ ఫౌం డేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వ హిస్తుందన్నారు. ఈ మేరకు ఫౌండేషన్ చైర్మన్, కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ నుంచి తనకు ప్రత్యేక ఆహ్వానం అందినట్లు సుబ్బయ్య తెలిపారు.

### శ్యాంప్రసాద్‌కు అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు



**మండవల్లి:** మండలంలోని కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు కురేళ్ల శ్యాంప్రసాద్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. విద్యారంగంలో ఆయన చేస్తున్న సేవలకు, విద్యార్థుల ఉన్నతికి చేస్తున్న కృషికి బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసినట్లు ప్రైవేట్ లెక్చరర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య శుక్ర వారం తెలిపారు. ఈ నెల 13న గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కా రాన్ని అందిస్తారన్నారు. ఈ సందర్భంగా ఉపా ధ్యాయులు, సర్పంచ్ థామస్, గ్రామ పెద్దలు శ్యాంప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

### నాటుసారా బట్టీపై మెరుపు దాడులు

**చాట్రాయి:** మండలంలోని పోలవరంలో ముం దస్తు సమాచారంతో నూజివీడు ఎక్సైజ్ ఎస్సైలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రజువారం సారాబట్టీపై మెరుపు దాడి చేసి నట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తా నయ్య తెలిపారు. ఈ దాడిలో ఓ తోటలో రహ స్యంగా నాటుసారా తయారు చేస్తున్న బిలుగుది చిట్టిబాబును అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే సారా తయారీ కోసం ఊరబెట్టిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

క్లుప్తంగా

## ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తణుకు ఆర్టీసీ డిపోలో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

**తణుకు అర్బన్ :** ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ తణుకు డిపో అధ్యక్షుడు సరిదే ఏసుబాబు డిమాండ్ చేశారు. ఎన్ఎంయూఏ సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు శుక్రవారం తణుకు డిపో ఆవరణలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్, అక్రమ రిమూవల్స్ ఆపాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో సెక్రటరీ బీవీఎన్ఎస్ సుబ్బారావు, కోశాధికారి ఎస్వీ రావు, సహాయ కార్యదర్శి టీఎస్, జోనల్ ప్రచార కార్యదర్శి వైవీ రావు, సభ్యులు పాల్గొన్నారు.

## అత్తిలిలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

**అత్తిలి:** వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిక చలివేంద్రాలు దోహదపడతాయని గ్రామ ప్రముఖులు వైట్ల రామసత్యం అన్నారు. శుక్రవారం అత్తిలి గ్రామంలో దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన వైట్ల బ్రాహ్మడు సత్రంలో ఏర్పాటు చేసిన మజ్జిక చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతీ ఏడాది వేసవిలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారని ఆలయ ఈవో ఆకుల వెంకట నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆనాల ఆదినారాయణరావు, పూతినీడి శ్రీనివాస్, అల్లి సత్యనారాయణ, దాసం బాబ్జి, వైట్ల పెద్దఅబ్బు, కేతా సత్యనారాయణ, మక్కా సూర్యనారాయణ, కొత్తపల్లి విజయ్‌కుమార్, వర్రి శ్రీను, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహితీ సమాఖ్య సభను జయప్రదం చేయండి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** తెలుగు సాహితీ సమాఖ్య 658వ సభ ఈ నెల 13వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని బీవీఆర్ కళా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండా బ్రహ్మాజీ, పైలు శ్రీనివాసరావులు వెల్లడించారు. ఈ సభలో బుర్రా లక్ష్మీనారాయణ సాహితీ అవార్డును గరికపాటి కళాపీఠం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశర్మకు అందజేస్తారని, అదే విధంగా కందుకూరి వీరేశలింగం సాహితీ అవార్డును కవి వేమూరి శ్రీనివాస్‌కు అందజేస్తారని తెలిపారు. బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, అధ్యాపకులు డాక్టర్ సుంకర గోపాల్, డాక్టర్ పుసుపులేటి రామచంద్రరావు, త్యాగరాజ నాగసభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ, విశ్రాంత ఎస్పీ పి.వెంకట రాధాకృష్ణ, బుర్ర శ్రీనివాసరావు తదితరులు హాజరవుతారని, సాహితీ గోష్టిని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రతిపక్షం విమర్శలను హేతుబద్ధంగా తీసుకోవాలి

**తణుకు అర్బన్:** ప్రతిపక్షం అంటే ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైన భూమిక పోషిస్తుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. సోషల్ మీడియాలో ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వైనంపై ఆయన స్పందిస్తూ తణుకులో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ విధానాలు, ప్రజా పాలనలో ఉన్న లోపాలను ఎత్తి చూపడం ప్రతిపక్షం బాధ్యతని, అందుకోసం చేసే సూచనలను కానీ, విమర్శలను కానీ హేతుబద్ధంగా స్వీకరించాలని ఆయన పేర్కొన్నారు. ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ వంటి వారిపై అన్ని స్థాయిల్లో కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అప్పుడే రాజకీయాల్లో ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో పేరూరి కాశియ్య, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై ప్రారంభించి, స్థానికులకు మజ్జిగను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛంధ సేవా సంస్థల ఆధ్వర్యంలో మరిన్ని మజ్జిగ చలివేంద్రాలు పట్టణంలో ప్రారంభం కావాలన్నారు. సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, సుంకర శ్రీనివాస్, గ్రంధి సత్యనారాయణ, పచ్చ వెంకటేశ్వరరావు, గరికపాటి బాపయ్య శర్మ, పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

**భీమవరం (ప్రకాశంచౌక్):** జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్ చట్టానికి లోబడి పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ జి.గీతాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. స్కానింగ్ సెంటర్లు ఏపీ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

# రాష్ట్రమంతా అరాచకాలు.. మారణ కాండ

- అత్తిలి ఎంపీపీ ఎన్నికలో ఎమ్మెల్యే దౌర్జన్యకాండ..
- కారుమూరిపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేదిలేదు..
- తణుకులో విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెల్లెం ఆనంద్ ప్రకాష్, యడ్ల తాతాజీ, గురుప్రసాద్



కారుమూరి నివాసంపై దౌర్జన్యం చేసిన చిత్రాలను చూపిస్తున్న ఆనంద్ ప్రకాష్, తాతాజీ, గురుప్రసాద్, సాయిబాబారెడ్డి తదితరులు

**తణుకు అర్బన్:** కూటమి ప్రభుత్వ అరాచకాలు, మారణకాండను వివరిస్తూ మాజీమంత్రి కారుమూరి వెంకటేశ్వరరావు మాట్లాడిన మాటలను వక్రీకరించి చూపించి కేసులు పెట్టి భయపెట్టాలంటే భయపడేవారు ఎవరూ లేరని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో సైకో అని వ్యక్తిగతంగా ఆయనను ఇష్టానుసారంగా చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లు మాట్లాడినప్పటికీ ఏవిధమైన కేసులు పెట్టకుండా జగన్ హుందాగా వ్యవహరించారని, కానీ నేడు కూటమి నేతలు తమ అసమర్ధ పాలనను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసి బీసీ వ్యక్తి అయిన కారుమూరిపై విషం చల్లుతున్నారని విమర్శించారు. అత్తిలి ఎంపీపీ ఎన్నికలో భాగంగా కూటమికి మెజారిటీ లేకపోయినా స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఒక సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టి వారికి సారా పోయించి మాజీమంత్రి కారుమూరి నివాసంపైకి దౌర్జన్యపూరితంగా వ్యవహరించిన తీరు ఫ్యాక్షనిజాన్ని చూపిస్తుందని ఎద్దేవా చేశారు. నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కారుమూరిపై అవాకులు చవాకులు పేలుతూ వ్యక్తిగతంగా దూషించారని, ఇసుక, మట్టి మాఫియాలో కూరుకుపోయారని విమర్శించారు. మంత్రిగా ఉన్న సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కారుమూరి అండగా నిలిచారని గుర్తు చేశారు.

**విచ్చలవిడిగా మద్యం, గంజాయి, పేకాట...**

రాప్తాడులో చిన్నసన్నకారు రైతు ఇంటిపైకి వచ్చి కత్తులతో నరికి చంపితే ఎవరూ నోరెత్తలేదని, కారుమూరి జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తే రాష్ట్రమంతా కేసులు నమోదు చేయడమేంటని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. తణుకులో విలేకరుల సమావేశంలో మట్లాడుతూ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని, దౌర్జన్యం దిశగా వెళ్తున్నారని విమర్శించారు. రాష్ట్రమంతా మద్యం, గంజాయి, పేకాట కేంద్రాలకు ఆవాసంగా మారిందని భవిష్యత్తులో ప్రజలు కూటమిని సింగిల్ డిజిట్‌కు పరిమితం చేస్తారని హెచ్చరించారు. చంద్రబాబునాయుడు ఒక మోసగాడని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి టాపిక్ డైవర్ట్ చేసే రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యకాండకు పోలీసు వ్యవస్థ ఏం చేస్తుందని నిలదీశారు.

**ప్రజలు అన్నీ గమనిస్తున్నారు**

ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారని సంక్షేమం లేదని, అభివృద్ధి కూడా లేదని జగన్‌పై తిట్ల దండకం వినిపించడమే పనిగా పెట్టుకున్నారని బహుజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్ విమర్శించారు. తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మీ అరాచకపాలనకు రాష్ట్రంలోని తల్లులంతా విలవిల్లాడుతున్నారని, మీ దౌర్జన్యకాండకు మండలానికో జైలును పెట్టుకున్నా భయపడే పరిస్థితిలేదని దుయ్యబట్టారు. భవిష్యత్తులో బహుజన కులాల సత్తా ఏంటో తెలియచేస్తామని అక్రమ అరెస్టులకు దిగితే నల్ల జెండాలతో పోలీస్ స్టేషన్‌లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. గతంలో ఆరిమిల్లి రాధాకృష్ణ పరిపాలన తణుకు ప్రజలకు తెలుసునని ఎస్సీ వర్గాల గొడవలో తనకు అనుకూలంగా లేరనే ఉద్దేశ్యంతో ఒక బీసీ ఎస్సైని నేలపై కూర్చోపెట్టిన ఘనుడని అన్నారు.

### తణుకంతా పేకాట స్థావరాలు..

అత్తిలి ఎంపీపీగా కొప్పులవెలమ సామాజిక వర్గానికి చెందిన మహిళకు వచ్చే అవకాశాన్ని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దౌర్జన్యంతో అడ్డుకున్నారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి అన్నారు. విమర్శించారు. తణుకులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఆ సామాజిక వర్గమంతా తమకు వచ్చే అవకాశాన్ని చెడగొట్టరంటూ బాధపడుతున్నారని అన్నారు. వేల్పూరు కేంద్రంగా తణుకు నియోజకవర్గం పేకాట, గుండాట, క్రికెట్ బెట్టింగ్‌లకు అడ్డాగా మారిందని అన్నారు. తణుకులో ఒక టీడీపీ నాయకుడి లాడ్జిలో భారీగా కోతాటను జిల్లా ఉన్నతాధికారులు దాడులు చేసి పట్టుకున్నారని కానీ ఆపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం అదే లాడ్జిలో పేకాట, గంజాయి విక్రయాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ఇటీవల తణుకులో అభివృద్ధి పనులను ప్రారంభించారని, ఈ నేపథ్యంలో పశువధ శాలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఆయనకు కూడా కర్మాగారంతో ఏమైనా సంబంధాలు ఉన్నాయో ఏంటో తెలియడంలేదని, పశువధకు బీజేపీ వ్యతిరేకమైనప్పటికీ ఎంపీ పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు సమస్య పరిష్కరించాలి

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని నందమూరు గ్రామంలోని చెరువులోకి నీరు వచ్చే కల్వర్టు పూడుకుపోవడంతో 1500 ఎకరాలకు సాగునీటికి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ విషయమై ఇటీవల గ్రామంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రైతులు తమ సమస్యను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు విన్నవించారు. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం కల్వర్టును ఏఈ పెద్దిరాజు పరిశీలించారు. ఈ మేరకు ఆయనకు రైతులు వినతి పత్రం అందజేశారు. తమ గ్రామానికి ఏ రోజు నీరు ఆగిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామ నాయకులు శనగన రాంబాబు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు అరసాల సుబ్బారావు,రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అత్తిలి:** మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తహసీల్దార్ దశికవంశీ తెలిపారు. శుక్రవారం అత్తిలి రామన్నపేటలోగల రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలన్నారు.

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణకుమారి



కొంద్రుప్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం దృశ్యం

**తణుకు అర్బన్:** కౌమార దశలో ఉన్న కిశోర బాలికలు, గర్భిణులు రక్త హీతనకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నందున మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.అరుణకుమారి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజైన శుక్రవారం స్థానిక ముత్యాల వారి వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐరన్, కాల్షియం పుష్కలంగా లభించే మునగాకును ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాగి పిండి, అటుకులు, ఖర్జూరం, పప్పు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జీఎం రాజకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**గర్భిణులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి**

**తాడేపల్లిగూడెం రూరల్:** గర్భిణులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నెం.127లో పోషకాహారంపై తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, ఐదేళ్ల లోపు పిల్లల తల్లులకు ఇన్‌ఫెక్షన్‌లు సోకకుండా చేతులను కడుక్కోవడం, పరిశుభ్రత, తల్లిపాలు, అనుబంధ పోషకాహారం గురించి వివరించారు. ఏఎన్ఎం టి.సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.ప్రమీల, జి.సూర్యకుమారి, పి.కనక దుర్గాంబ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, కొంద్రుప్రోలు గ్రామంలోని 265 నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంఎస్‌కే వీణ, ఏఎన్ఎం మహేశ్వరి, ఆశా కార్యకర్తలు వీరలక్ష్మి, కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.సుమలత, పి.లక్ష్మి, డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో భారత రాజ్యాంగం



తణుకులో బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు భీమారావు, నాగరాజు తదితరులు

**తణుకు అర్బన్:** స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం లక్ష్యంగా ఆవిర్భవించిన భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వం మతతత్వ పాలన కారణంగా ప్రమాదంలో ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. బీజేపీ పాలనలో లౌకికవాదం, మానవ హక్కులకు ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగ లక్ష్యాలు నెరవేర్చడానికి, ప్రజాస్వామ్య మనుగడకు, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకులో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రియల్ 14 అంబేడ్కర్ జయంతి వరకు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత పదకొండేళ్లుగా దేశంలో మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతుందని, మోదీ పరివారం రాజ్యాంగాపై దాడి చేస్తున్నారని, లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని, రాజ్యాంగం అమలు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్రిభాషా సూత్రం పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై హిందీ భాషను రుద్దుతున్నారని, మరో పక్క ప్రాంతాల మధ్య, మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. అణచివేత, వివక్షత లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ ఆశయాలను తుంగలోకి తొక్కుతున్నారన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ సంబంధంలేని నేటి పాలకులు రాజ్యాంగాన్ని తిరగ రాయడానికి కుట్రలు పన్నుతున్నారని, రాజ్యాంగ వ్యవస్థలను కూల్చేస్తున్నారని, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదం, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా నేడు పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుట్టా అమ్మిరాజు, మందుల ముత్తయ్య, గంధ్రాపు శ్రీను, పతి రాజశేఖర్, కొంబత్తుల రవికుమార్, బొద్దాని మురళీకృష్ణ, పెన్మెత్స సత్యనారాయణరాజు, బొద్దాని రాజు, నమ్మి ప్రసాద్, కట్టుంగ శంకర్ పాల్గొన్నారు.

# పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీకటిమిల్లి మంగరాజు, బీసీ నాయకులు

**తాడేపల్లిగూడెం అర్బన్ :** బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావ్‌పూలే నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి కొట్టు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే అడుగుజాడల్లోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి బీసీల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వారి అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే**

**తణుకు అర్బన్:** అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శనీయుడని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజ అభివృద్ధి చెందుతుందని, వెనుకబడిన వర్గాల్లో విద్యకు అత్యధిక ప్రాధాన్యతినిచ్చి విద్యావంతులుగా మారేందుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పొట్ల సురేష్ మాట్లాడుతూ సమాజంలో సామాజిక స్ఫూర్తికి పనిచేసిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అన్నారు. పూలే ఆలోచనా విధానాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిసిట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎస్సీసెల్ తణుకు మండల అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, డీజే అమూల్యారావు, బిరుదుకోట చింతన్న, పుల్లెపు సూర్యచంద్రరావు, షేక్ జిలాని, గారపాటి సత్యనారాయణ, కొమ్మోజు రామకృష్ణ, రాచమళ్ల సత్యనారాయణ, టీపీ నాగిరెడ్డి, వై.రామకృష్ణ, కాకరపర్తి ఆంజనేయులు, అంబటి శ్యామ్, కొమరపు లక్ష్మణరావు పాల్గొన్నారు.

**పూలే సంస్కరణలు అనుసరణీయం**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** మహాత్మా జ్యోతిరావు పూలే సంస్కరణలు అనుసరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన వద్ద ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ పూలే మహిళా విద్యకు మార్గదర్శకులు అన్నారు. పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో ప్రవేశపెట్టి, పబ్లిక్ హాలిడే ప్రకటించాలని కోరారు. అనంతరం బీసీ నాయకులు ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంచారు. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అడ్డాల నరసింహారావు, గౌరవాధ్యక్షులు చింతకాయల సత్యనారాయణ, కిలాడి సాయిబాబా, దూదేకుల దస్తగిరి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో....**

సామాజిక అసమానతలు రూపు మాపేందుకు ఉద్యమించిన మహానేత పూలే అని బీజేపీ నాయకులు కొనియాడారు. ఆర్టీసీ డిపో వద్ద జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో నాయకులు ఈతకోట తాతాజీ, కోట రాంబాబు, పీవీ రాఘువులు, దువ్వా శ్రీనివాస్, పెదపోలు వీర రాఘువులు, తుమరాడ చిన్న, రామగాని సత్యనారాయణ, మారిశెట్టి నరిసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పూలే జయంతి**

**ఇరగవరం:** మండలంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో పూలే విగ్రహానికి ఎంపీపీ అలివేలు మంగతాయారు, ఎంపీడీవో శ్రీనివాస్ పూలమాలలు నివాళులర్పించారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**ఆదికవి నన్నయ్య వర్సిటీలో జ్యోతిరావుపూలే జయంతి**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పూలే జయంతి సందర్భంగా స్థానిక ఆదికవి నన్నయ్య వర్సిటీ క్యాంపస్‌లో శుక్రవారం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.అశోక్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, కుల వివక్ష, నిరక్ష్యరాస్యత, సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా పూలే అవిశ్రాంత పోరాటం చేశారని తెలిపారు.

## వచ్చే ఏడాది నుంచి పాలిటెక్నిక్‌లో కంప్యూటర్ కోర్సు

**తణుకు అర్బన్:** తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి కంప్యూటర్ బ్రాంచ్ ఏర్పాటుకు ఏఐసీటీఈ నుంచి అనుమతి లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తులసిరాధ తెలిపారు. విద్యార్థులు అధికశాతం కంప్యూటర్ కోర్సులవైపు మొగ్గుచూపుతున్న నేపథ్యంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో కంప్యూటర్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో సాంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులకు డిమాండ్ పెరిగే దృష్ట్యా తల్లి దండ్రులు, విద్యార్థులు గమనించి తమ అభీష్టం మేరకు కోర్సులను ఎంపిక చేసుకోవచ్చని అన్నారు. ఈ ఏడాది పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్–2025)ఈనెల 30వ తేదీన తణుకు పట్టణంలో సుమారుగా 7 కేంద్రాల్లో నిర్వహించబడుతుందని, అందుకు సంబంధించి ఉచిత శిక్షణ మా పాలిటెక్నిక్ కళాశాలలో ఇస్తున్నామని, ప్రస్తుతం 600 మంది ఈ ఉచిత శిక్షణకు హాజరవుతున్నట్లు వివరించారు.

## శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో అదనపు సీట్లు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలకు 2025–26 విద్యా సంవత్సరానికి సీఎస్ఈ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సులు (ఏఐఎంఎల్)కు ఒక్కొక దానికి అదనంగా 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లును అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) మంజూరు చేసినట్లు కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు వెల్లడించారు. కళాశాలలో శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సీఎస్ఈ 120 సీట్లుకు గాను 180కు, ఏఐఎంఎల్‌లో 120 సీట్లుకు గాను 180కు పెంచడం జరిగిందని తెలిపారు. బిటెక్‌లో సీట్లు సంఖ్య 1,320 కాగా, ఈబీసీ రిజర్వేషన్ సీట్లుతో కలిపి 1452కు పెరిగినట్లు చెప్పారు. అంతేగాక పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశానికి గాను నిర్వహించే టెస్ట్‌కు కళాశాలలో ఉచిత శిక్షణ ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. 500 మంది విద్యార్థులు హాజరువుతున్నట్లు వివరించారు. కళాశాల కోశాధికారి పేరూరి బాల కాశయ్య, డైరెక్టర్ చక్కా అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యల్లారమ్మ ఉత్సవాలు

**తణుకు అర్బన్:** తణుకు మండలం మండపాక యల్లారమ్మ అమ్మవారి వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరగోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాక గ్రామస్తుల ఇలవేలుపు కావడంతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆసాదులు, రామడోలు, తాసాలు, వీరణాలు, డప్పుల బృందాలతోపాటు గరగల నృత్యాలు భక్తులను అలరించాయి. కాళికా బృందం, భేతాళమేళం, కేరళ తాంబూల మేళం, దిమిశా, బుట్టబొమ్మలు, గారడీ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

## భూముల కోసం ఉద్యమించిన మంగన్న



దండగర్రలో బొరుసు మంగన్న జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం రూరల్ :** జమిందారీ భూస్వాముల కబంధ హస్తాల్లో ఉన్న భూములను పేదలకు పంచాలని రైతాంగ పోరాటాలు నిర్వహించిన వ్యక్తి బొరుసు మంగన్న అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని దండగర్ర గ్రామంలో కమ్యూనిస్టు ఉద్యమకారుడు బొరుసు మంగన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మంగన్న స్ఫూర్తితో వామపక్ష కార్యకర్తలు కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని, రానున్న కాలంలో ఈ పోరాటాలు విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ జిల్లాలో తాడేపల్లిగూడెం మండలానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. ఒకటి మాధవరం కాగా, మరొకటి రెడ్ విలేజ్ దండగర్ర అని పేర్కొన్నారు. సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, శేషబాబు, అల్లు సుబ్బారావు, కరక వెంకట్రావు, పోతు శ్రీను, మిద్దే జాను, తంగేటి శ్రీనివాస్, చిట్టి ప్రసాద్, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీపీఐ ఆధ్వర్యంలో బొరుసు మంగన్న వర్ధంతి నిర్వహించారు. సీపీఐ నాయకులు మండల నాగేశ్వరరావు, కర్రి సోమేశ్వరరావు పాల్గొన్నారు.